19CTR1:19CTR1.qxd 8/19/2026 11:25 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మొగిలీశ్వరాలయంలో వరుణహోమం

బంగారుపాళ్యం, ఆగస్టు 19 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురవాలని ఆశిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ వరుణహోమం, వరుణజపం కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం స్వయంభూ మొగిలీశ్వరాలయంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వరుణహోమం, వరుణ జపం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం నందు కలశ పూజలు నిర్వహించి శాస్త్రబద్ధంగా గణపతి పూజలు చేపట్టారు. అనంతరం అర్చకులు ఆలయ పుష్కరణిలో వరుణజపం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజు, అర్చకులు గంగాధరగురుకుల్, సోము, పవన్, దండపాణి, కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

### కుప్పం మున్సిపాలిటీకి

## రూ.60 కోట్ల నిధులు మంజూరు

### కమిషనర్ శ్రీనివాసరావు



కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం 60 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సిసి రోడ్ల నిర్మాణానికి 53 కోట్లు, బిటి రోడ్ల నిర్మాణానికి 1.86 కోట్లు ,1.36 ఎకరాల్లో పార్కుల అభివృద్ధికి 5.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. త్వరలో పనులకు టెండర్లు పిలుస్తామన్నారు.

### పంచాయతీరాజ్ రోడ్లకు

## నిధులు మంజూరు చేయాలి

### అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త :

మారుమూల గ్రామాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల ప్రజల అవస్థలను సభ దృష్టికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీసుకొని వచ్చారు. నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలు ఎదుర్కొంటున్న ప్రధాన రహదారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో 22 పంచాయతీరాజ్ రోడ్లు లేక అనేక చిన్న గ్రామాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మారుమూల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు సరైన రోడ్లు లేని కారణంగా ముఖ్యంగా పాము కాటు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు, అనారోగ్యం బారిన పడినప్పుడు మరియు గర్భిణీ స్త్రీలకు అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు సకాలంలో ఆసుపత్రులకు చేరుకోలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకోవడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ గ్రామాల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని ఆయన సభకు వివరించారు. ఈ రోడ్లన్నీ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్నందున, వీటికి అవసరమైన ఫారెస్ట్ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనుమతులు వచ్చిన వెంటనే పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ రోడ్లను బీటీ, సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని పంచాయతీ రాజ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలు మరియు మారుమూల గ్రామాల ప్రజల అత్యవసర అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ 22 పీఆర్ రోడ్లను ప్రత్యేక ప్రాధాన్యత“తో మంజూరు చేయాలని ఆయన గట్టిగా కోరారు.

## ఇక పట్టణాల్లో మున్సిపల్ పోరు!

### ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు !!
### ఇక మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లను ఓటర్లే ఎన్నుకోవచ్చు



ప్రభాతవార్త-తిరుపతి:

కీలకమైన కార్పోరేషన్ మేయర్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్ పర్సన్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకునేందుకు మార్గం సుగమం అయింది. గతంలో అమల్లో ఉన్న ఈ విధానాన్ని 2005లో రద్దు చేశారు. ఇప్పుడు మళ్లీ కూటమి సర్కార్ దీన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్రమంత్రివర్గం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీలు , నగర పంచాయతీల ఛైర్మన్లను నేరుగా ప్రజలే ఎన్నుకొనే ప్రత్యక్ష ఎన్నికలు) విధానాన్ని ఆమోదించింది. ఇకపై పరోక్ష విధానానికి బదులు ఓటర్లు నేరుగా తమ పట్టణ అధిపతులను ఎనుకొనే పద్ధతి అమల్లోకి రానుంది. నగర మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి.దీంతో స్థానిక ఎన్నికల తరువాత క్యాంప్ రాజకీయాలు అక్రమాలకు అవకాశం ఉండదు.స్థానిక నాయకత్వం మరింత బలోపేతం అవుతుంది. 1986 వరకు మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని, 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని,ఆ తరువాత పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ , మున్సిపల్ ఛైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, ఛైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని ఆయన తెలిపారు.

గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు జరిగేవి. అయితే 2004లో డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పరోక్ష ఎన్నికలకు తెరతీశారు. ఇప్పుడు తిరిగి ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆలోచన. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేశాయి. 2026 అక్టోబరు 1న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఫలితాల వరకు సుమారు 45 రోజుల్లో పూర్తి కానుంది. తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్ కార్పొరేషన్ లో 68 పంచాయతీల విలీనం ప్రతిపాదన ఉందని, అది వీలుకాక పోతే పంచాయతీలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తాజాగా ప్రకటించారు. శ్రీకాళహస్తి మున్సిపాల్టీ మినహా మిగిలిన నాలుగు మున్సిపాలిటీలలో సజావుగా ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. చిత్తూరు జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్ తో పాటు మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. తిరుపతిలో టిడిపి, చిత్తూరులో జనసేన పోటీ చేస్తుందని అంటున్నారు. మిగిలిన మున్సిపాలిటీలలో టిడిపి, వైసిపి నేతల మధ్య పోటీ ఉండవచ్చు.



## ముగిసిన గంగ జాతర సంబరాలు

నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :

మండలంలోని నారాయణవనం పంచాయతీతో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో మంగళవారం నుంచి గంగజాతర వేడుకలు ఘనంగా జరుగుతున్నది. జాతరలో భాగంగా బుధవారం ఉదయం వరకు అమ్మ వారిని గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో జాతరను ఘనంగా చేసుకున్నారు.

### సల్లంగా చూడమ్మా

## శ్రీగంగమ్మ తల్లి

### వైభవంగా ముగిసిన శ్రీ గంగమ్మ తల్లి జాతర

రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీ గంగమ్మ తల్లి గంగమ్మ తల్లి కోరిను కోర్కెలు తీర్చే తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీ గంగమ్మ తల్లి జాతరకు బుధవారం తరలివచ్చారు. బుధవారం తెల్లవారుజామున శ్రీ అమ్మవారి విశ్వరూప ప్రతిమను ఊరేగింపుగా తీసుకొచ్చి నడివీధి శ్రీ గంగమ్మ శూలం వద్ద జాతర నిర్వాహకుడు, గుడి ఛైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి కమిటీ సభ్యులు ప్రతిష్ఠింపజేశారు. ఉదయం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు కలగకుండా క్యూ పద్ధతిలో భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితర బిజెపి నేతలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. గుడి ప్రాంగణమంతా శ్రీ గంగమ్మ తల్లి నామ స్మరణతో మారు మోగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, జ్యోతి నారాయణ, ఉమేష్ వి ఆర్ రావణన్, ఎంజిరెడ్డి, సంపత్ తదితరులు అమ్మ తల్లి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మహా కుంభాన్ని నైవేద్యంగా సమర్పించారు. రాత్రి గాంధీ విగ్రహం వద్ద బాణాసంచా అందరిని ఆకట్టుకుంది. రాత్రి శ్రీ గంగమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన సాంస్కృతి కార్యక్రమం పలువురివి అలరించింది. కుల మతాలు గతీతంగా ప్రతి ఒక్కరు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. నూతనంగా వెలసిన అంగళ్లు, రంగులరాట్నాలు, కొలంబస్, జైంట్ విల్, జాతరలో ప్రత్యేక ఆకర్షణలు అయ్యాయి. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి తమ సిబ్బందితో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి అమ్మవారిని ఊరేగించి అమ్మ తల్లి ప్రతిమను జల్దిలో కలపడంతో జాతర తంతు ముగిసింది. జాతరంగ నిర్విఘ్నంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా గుడి ఛైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు .

## ఉత్కర్ష మహోత్సవం-2026 ఘనంగా ప్రారంభం

### వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం చేసేది సంస్కృతమే: కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్





తిరుపతి విద్య, ఆగస్టు 19 ప్రభాతవార్త

వికసిత్ భారత్‌కు దిశ, దశ చూపించగల శక్తి సంస్కృత భాషకు ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ అన్నారు. సంస్కృతంలో నిక్షి ప్తమైన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసి, సమాజానికి ఉపయోగపడే విధంగా అన్వయించుకోవాలని సూచించారు.జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్కర్ష మహోత్సవం -2026ను బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్, రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణరావు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ 2020లో కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాల చట్టం ద్వారా దేశంలోని మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాలకు కేంద్ర విశ్వవిద్యాలయ హోదా లభించిందన్నారు. భారతీయ సంస్కృతికి మూలాధారమైన సంస్కృత భాష అధ్యయనం, బోధన, పరిశోధనలకు ఈ విశ్వవిద్యాలయాలు దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సంస్కృతంలో ఉన్న విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞాన విషయాలను ఆధునిక అంశాలతో అనుసంధానం చేస్తూ పరిశోధనలు చేపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సంస్కృత భాష అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల ద్వారా సహకరిస్తోందని తెలిపారు. ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొంటున్న పండితులు విస్తృతంగా మేధోమథన సదస్సులు నిర్వహించి, సమాజానికి ఉపయోగపడే అంశాలను వెలికితీయాలని సూచించారు.మహోత్సవంలో భాగంగా మహాపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అద్వైత వేదాంత విద్యార్థి వరదరాజన్‌కు వేదాంత విద్వన్మణి సత్కారంతో పాటు నగదు పురస్కారాన్ని మంత్రి అందజేశారు. ఆయనకు విద్యాబోధన చేసిన అద్వైత వేదాంత విభాగ ఆచార్యులు డా. శ్రీహరి శివరామ్ దాయగుడేను శాస్త్ర విద్వన్మణి బిరుదుతో సత్కరించారు. అలాగే కె.వి.ఎస్.ఎస్. అవధాని, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు ప్రొ. ప్రతాప్‌లకు విశ్వవిద్యాలయం తరఫున ప్రాచ్య విద్యాభూషణ అవార్డులు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం ప్రచురించిన 25కు పైగా పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్జున్‌రామ్ మేఘ్వాల్ గతంలోనూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. మరోసారి ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమానికి హాజరు కావడం సంస్కృత భాష, భారతీయ సంస్కృతిపై ఆయనకున్న అభిమానానికి నిదర్శనమన్నారు లాల్ బహదూర్ ఆచార్య జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ సంస్కృతాన్ని జనభాషగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఉత్కర్ష మహోత్సవం నిర్వహించడం ఆనందదాయకమన్నారు.కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొ. కె. గణపతి భట్ సభా సంచాలకులుగా వ్యవహరించగా, అడిషనల్ కోఆర్డినేటర్లు డా. భారత భూషణ్ రథ్, డా. నాగరాజు భట్ కార్యక్రమ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, లక్నో క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొ. సర్వనారాయణ ఝా, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీవాత్సవ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. దక్షి ణామూర్తి శర్మతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణపై సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 19 ప్రభాతవార్త :




గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికలకు ముందు నిర్వహించాల్సిన ప్రక్రియలు, పోలింగ్ కేంద్రాల తనిఖీలు, ఎన్నికల సామగ్రి లభ్యత తదితర అంశాలపై సమీక్షి ంచారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 807 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 16 పంచాయతీలు కోర్టు కేసులకు సంబంధించిన అంశాల కారణంగా ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందని, మిగిలిన 791 గ్రామ పంచాయతీలకు నోటీసుల ప్రచురణ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల మార్కింగ్‌తో పాటు ఎన్నికలకు ముందు నిర్వహించాల్సిన ఇతర ప్రక్రియలు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు సుమారు 40 శాతం మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే జిల్లాలోని పోలింగ్ కేంద్రాల తనిఖీ ప్రక్రియ కూడా దాదాపు పూర్తయిందని, నిర్ణయించిన గడువు నాటికి మిగిలిన ప్రక్రియలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన సామగ్రి కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇండెంట్ పంపినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాల్సిన సామగ్రి, రాష్ట్ర స్థాయి నుంచి సమకూర్చే సామగ్రిపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, జిల్లా స్థాయిలో ఎన్నికల సామగ్రి సమీకరణకు సంబంధించి స్పష్టమైన కమ్యూనికేషన్‌ను త్వరలో జారీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కూడా సమీక్షి ంచారు. జిల్లాలో 6 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని, వాటిలో శ్రీకాళహస్తి పట్టణ స్థానిక సంస్థకు సంబంధించిన అంశాలపై ప్రస్తుతం ముందుకు వెళ్లే పరిస్థితి లేదని, మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని అధికారులు వివరించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి 68 గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు గత డిసెంబర్‌లో సమర్పించిన ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న విషయాన్ని కూడా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వ స్థాయిలో సమీక్ష జరుగుతోందని, అనంతరం జిల్లాకు సమాచారం అందిస్తామని రాష్ట్ర

### మళ్ళీ శివరాత్రి వచ్చే వరకు ...

## శివం టు శివం రోడ్డు పూర్తి కాదా?

### పరిహారాల చెల్లింపుల్లో రెవెన్యూశాఖ జాప్యం



శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రూ.34కోట్లతో చేపట్టిన ‘శివం టు శివం’ రోడ్డు పనులకు నిధుల కొరత లేదు. కాంట్రాక్టర్ పనులు చేయటానికి సిద్ధం. ఈ రోడ్డు పూర్తి అయితే చాలా వరకు రోడ్డు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేసారు. స్వర్ణముఖి వంతెన సమీపంలో దుర్గాంబకొండ అంచున పది ఇళ్ల నిరుపేదలు కొల్పోయారు. వారికి పరిహారం విషయంలో రెవెన్యూశాఖ దోబుచులాట ప్రగతికి అడ్డంకిగా మారింది.వివరాలు పరిశీలిస్తే శివం టు శివం రోడ్డు ప్రారంభం పాయింట్లో నిరుపేదల ఇళ్ళు పది తొలగించాల్సి వచ్చింది. ఈ పనులను నాయకులు శ్రీకాళహస్తి ఆర్‌డిఓకు అప్పగించారు. ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాధితులకు రాజీవ్‌నగర్‌లో ఒక్కొక్కరి మూడు సెంట్లు స్థలాన్ని అందిస్తామని భరోసా ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. అంతేకాక ఇళ్ళు కొల్పొయిన వారికి రూ.50వేలు నగదు కూడా ఇస్తామని ఆశ చూపటంతో ఇళ్ళు కొట్టేయటానికి బాధితులు అంగీకరించారు. ఇది జరిగి మూడు నెలలు అయ్యింది. అయితే బాధితులకు పరిహారం హామీ అమలు చేయలేదు. పట్టాలు స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా పట్టాలు ఇచ్చారు.కానీ స్థలాలు చూపలేదు. అరచేతిలో స్వర్గం చూపే తహాశీల్దార్ ఎప్పుడు వివరణ అడిగినా పట్టాలు రెడి చేసాం.కలెక్టర్ అనుమతి రావాలని చెబుతుంటారు.హడావిడిగా పట్టాలు ఇచ్చారు.కానీ ఆ 15 మందికి మరో స్వాతంత్ర్య దినోత్సవం వస్తేకానీ చూపలేరేమో? మరి ఇందులో బ్రహ్మరహస్యం ఏమిటో అంతుపట్టడం లేదు. రెవెన్యూ జాప్యం ప్రగతికి శాపంగా మారింది.శాసనసభ్యుడు ప్రశ్నించినపుడు అంతా అయిపోయిందని అధికారులు తప్పించుకుంటున్నారు.ఇక్కడ సర్కిల్ ఏర్పాటుకు ఓ లాడ్జిలో కొంత భాగం సేకరించాల్సి ఉంది. వీటిని బట్టి చూస్తే మరో శివరాత్రికి కూడా సాధ్యం కాదేమో? అని జనం చర్చించుకుంటున్నారు. దేవస్థానం చేపట్టే పనులు దిశ దెశ నిర్దేశం లేకుండా సాగుతున్నాయనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారి. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పని చేసే అధికారులకు రాజకీయ నాయకులు దిశ దెశ నిర్దేశం చేసారో ఏమో? ముఖ్యంగా ఏ అంశంపై వివరణ కోరటానికి ఇటకు ఫోన్ చేస్తే తీయరు. అదే తరహాలో తహాశీల్దార్ కూడా ఆచరిస్తున్నారు. ఎంఎల్‌ఏ ఏమో అధికారులు మీడియాతో సమన్వయంతో పని చేయమని ఇటీవల జరిగిన బోర్డు సమావేశం సందర్భంగా కూడా ప్రకటించారు. కానీ ఆచరణలో ఏదీ జరగటం లేదు.

20 CTR 2:20 CTR 2.qxd 8/19/2026 11:28 PM Page 1



# ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు చెప్పాలి



కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం – స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి !!

సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వారికి వివరించి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత మరింత పెరిగేలా చూడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న ఇంటింటికీ తెదేపా కార్యక్రమంను వందశాతం ఖచ్చితంగా చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వంతో కలుగుతున్న లబ్ధి, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను తప్పక వివరించాలని సూచించారు. ఈవిషయంలో ఎవరూ అలసత్వం ప్రదర్శించరాదన్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోలేకనే 2019లో ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. ఇక ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఇంకా అర్హులైన వారు ఓటర్ల జాబితాలో తప్పి ఉంటే అలాంటి వారికి ఓటు హక్కు లభించేలా చూడాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడే వారికి సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తప్పక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో అనుడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, ఉదయ్‌కుమార్, సుబ్బు, వెంకటరమణ,కడ సభ్యులు రాజ్‌కుమార్,రామచంద్ర, సుగుణమ్మ, సతీష్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలు పాల్గొన్నారు.

## కురబకుల సంఘనేతలకు ఘనసన్మానం



కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ కురబకులసంఘం నేతలను బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ అధ్యక్షుడు లీలా వెంకటేష్, కార్యదర్శి కదిరప్ప, మండల అధ్యక్షులు వేలుగౌడ్, వెంకటపతి, కోడెప్ప, అశోక్‌లను ఈసందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, అనుడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, మాజీ అధ్యక్షుడు నాగభూషణం, రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, కురబ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, బూత్ ఇన్‌చార్జులు జాలు, లోకేష్, మున్సిపల్ కార్యదర్శి దేవా పేర్కొన్నారు. బుధవారం ప్యాలస్‌రోడ్డులో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నేతలు మల్లయ్య నాయుడు, రాజా, ప్రసాద్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సిలింగ్

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త



రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు బుధవారం ఎస్సై నరేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. 14మంది రౌడీ షీటర్లపై నిఘా కొనసాగుతుందన్నారు. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం, ఎన్నికల సమయంలో వ్యక్తులను ప్రభావితం చేయడం, బెదిరించడం, రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రౌడీ షీటర్లను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

## భవనంపై నుండి పడి బాలుడు మృతి

బైరెడ్డిపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త

స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మణ్‌రెడ్డి, స్వప్నలకుమారుడు భానురెడ్డి (3) అనే బాలుడు తమ ఇంటిపైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. పరిసరాల వారు బాలుడ్ని గుర్తించి విషయాన్ని ఇంట్లోనే ఉన్న తల్లికి చెప్పారు. అనంతరం బాలుడ్ని హుటాహుటిన చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడని తెలిసింది. దీంతో ఇందిరమ్మ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎస్సీ..ఎస్టీ..బిసి ఓటర్ల గుర్తింపు ప్రక్రియ షురూ!!

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సంసిద్ధం అవుతున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్లను గుర్తించే ప్రక్రియ మొదలైంది. ఈమేరకు గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇదివరకు ఉన్న ఓటర్ల జాబితాలో ఓటర్లుగా నమోదై ఉన్న వారిలో ఎస్సీ,ఎస్టీ, బిసి ఓటర్లను గుర్తించి నివేదిక అందించాలని ఉన్నతాధికారులు పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు (పిడిఒ)లకు ఓటర్ల జాబితాలను అందించారు. దీంతో పిడిఒలు గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీ, బిసి ఓటర్లను గుర్తించి నివేదికలు రూపొందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లుకల్పించాలనినిర్ణయించిననేపథ్యంలోప్రస్తుతంఓటర్లకులాల వివరాలు సేకరించడం జరుగుతోంది.

## 22న కాణిపాకం బ్రహ్మోత్సవాలపై సమన్వయ సమావేశం

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:



కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో 2026 బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కాణిపాకం ఇఓ కార్యాలయంలోని సమావేశభవనంలో ఈ నెల 22వ తేదీన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై చర్చించడానికి అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సమావేశానికి పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌అండ్‌బి, అగ్నిమాపక, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు హాజరు కానున్నారు.

## 4.5 టన్నుల తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత



గుడిపాల, ఆగస్టు 19 ప్రభాతవార్త:

తమిళనాడు రాష్ట్రం నుండి అక్రమంగా రాష్ట్రానికి తరలిస్తున్న 4.5 టన్నుల రేషన్ బియ్యంను బుధవారం గుడిపాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం బొమ్మసముద్రం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన ఒక టాటా ఎసి మనీ కంటైనర్ వాహనం ఆంధ్రవైపుకు వస్తుండటం పోలీసులు గమనించారు. ఈ క్రమంలో డ్రైవర్ పోలీసులను చూసి వాహనంను అక్కడే నిలిపి పారిపోయాడు. పోలీసులు సదరు వాహనంను తనిఖీ చేయగా వాహనంలో 90 సంచుల్లో 4,500 కేజీల రేషన్ బియ్యం వున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ తమిళనాడు రాణిపేటకు చెందిన లోకేష్ అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యంను ఆంధ్రాకు సరఫరా చేస్తున్నాడని విచారణలో తేలించదని, త్వరలోనే లోకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఆయుధాలు వినియోగం

– ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

పోలీసు విధుల్లో ఆయుధ వినియోగం అత్యంత బాధ్యతతో కూడుకున్న అంశమని, ప్రతి పోలీసు సిబ్బంది ఆయుధాలను క్రమశిక్షణతో, పూర్తి అవగాహనతో, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ వినియోగించాలని ఎస్పీ తుషార్ డూడి సూచించారు. చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో 2025 బ్యాచ్‌కు చెందిన స్టైఫెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళకు ఇస్తున్న శిక్షణలో భాగంగా జరుగుతున్న ఫైనల్ ఔట్‌డోర్ వెపన్ పరీక్షలను బుధవారం ఎస్పీ తుషార్ డూడి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయుధంను చేతపట్టిన ప్రతి సందర్భంలో అప్రమత్తత, నియంత్రణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శిక్షణలో కేవలం ఆయుధ వినియోగంలోనే కాకుండా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, విధి నిర్వహణలో అప్రమత్తత వంటి అంశాల్లో పూర్తి స్థాయి నైపుణ్యం సాధించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ జె.రాంబాబు, ఆర్ఐ ఎంటిఓ వీరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జల్లికట్టుకు పోలీసుల అనుమతి ఇవ్వం

యాదమరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:

యాదమరి మండల పరిధిలో గతంలో చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో వుంచుకుని ప్రజల భద్రత, శాంతిభద్రతలను దృష్టిలో వుంచుకుని జల్లికట్లు, బుల్ రేస్ తదితర ప్రమాదకర కార్యక్రమాలకు పోలీసు అనుమతి వుండదని ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు. గతంలో మండల పరిధిలో జరిగిన జల్లికట్టులో ఒక వ్యక్తి మృతి చెందాడని, ఈ ఘటనకు సంబంధించి అప్పటి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని, ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో విచారణలో వుందన్నారు. జల్లికట్టుతో మనుషుల ప్రాణాలతో పాటు పశువుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని, మండల పరిధిలో ఎలాంటి ప్రమాదకరమైన ఆటలను ఎవ్వరు నిర్వహించరాదని ఎస్ఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతరాలు, ఉత్సవాలు, ఇతర సామూహిక కార్యక్రమాల సందర్భంగా అనుమతి లేని డిజెలు, డాన్స్‌ప్రోగ్రాంలు నిర్వహించరాదన్నారు. అలాగే వివిధ వర్గాల మధ్య వివాదాలు, ఉద్రిక్తతలకు దారితీసే వివాదాస్పద ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయరాదన్నారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో వుండటంతో ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు సంబంధిత ఆదేశాలకు తప్పనిసరిగా పాటించాలని, సభలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, ఇతర సామూహిక కార్యక్రమాలు నిర్వహించే ముందు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి వుంటుందని స్పష్టం చేశారు.

## జిల్లా, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా

రమేష్‌బాబు, టిక్కిరాయల్‌లు ప్రమాణస్వీకారం

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రమేష్‌బాబు, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా టిక్కిరాయల్‌లు బుధవారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎల్‌జిబి టవర్స్‌లో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ కమలాకర్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ కమలాకర్‌రావు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌బాబు, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా టిక్కిరాయల్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కిరాయల్‌లు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్, చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ లోకేష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ధనంజయ నాయుడులు,పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## తెదేపాను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిక



కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

కుప్పం పట్టణంకు చెందిన మైనార్టీ నాయకులు ఇమ్రాన్, రహంతుల్లాలు తెలుగుదేశం పార్టీని వీడి తమ సొంత గూడు అయిన కాంగ్రెస్ పార్టీలోకి మరలా చేరారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్ కమలాకర్, డిసిసి అధ్యక్షుడు రమేష్‌బాబుల సమక్షంలో వీరు తెదేపాకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## తప్పుడు కేసులతో బెదిరింపులు

– తెదేపా రాష్ట్ర అధ్యక్షుడికి వినతి



చిత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:

క్షేత్రస్థాయిలో రాజకీయ ఎదుగుదలను చూసి జీర్ణించుకోలేక స్థానిక నాయకులు తనపై తప్పుడు కేసులు పెట్టి పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తున్నారనీ చిత్తూరురూరల్ మండలం అనంతాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలసి వినతి చేసారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వివరించేందుకు సైతం తనను కలవనీయకుండా వాళ్ల మనుషులతో దాడి చేయించారని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వీల్లేదని, పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు స్థానిక నాయకులతో నోటీసులు ఇచ్చినట్లు ఆయనకు వివరించారు. సానుకూలంగా స్పందించిన పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని, అధైర్యపడవద్దని ప్రవీణ్‌కు ధైర్యం చెప్పారు.

## 22న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటి సమావేశం

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న 2026 స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లపై ఈనెల 22న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉభయదారులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, పాలకమండలి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

## బీసీలు అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి

రామకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు అనేక రకాలుగా రాజకీయ ప్రాధాన్యతలు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి 1987లో దివంగత నేత ఎన్టీఆర్ 20 శాతం బీసీలకు ప్రాధాన్యత కల్పించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో1995లో 34 శాతానికి రిజర్వేషన్లు తీసుకొచ్చారన్నారు. గత రెండేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా1.17 కోట్లు మంది బీసీలకు32,534 కోట్ల నిధులు ఆర్థిక సాయం అందించారు. గత వైసిపి పాలనలో 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు 24 శాతం కు తగ్గించడం వల్ల16,800 మంది బీసీలకు స్థానిక సంస్థల పదవులు దూరమయ్యాయి అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతనిద్యం నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

## పిఫోర్ తోనే ఆర్థిక అభివృద్ధి

రామకుప్పం,ఆగస్టు 19 ప్రభాతవార్త

బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పి ఫోర్‌తోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మిట్టపల్లి గ్రామంలో పి ఫోర్ ద్వారా ఎంపికైన నాగరాజు, రాజశేఖర్ కుటుంబ పోషణ ఆర్థిక సహాయంగా ఆటో కొనుగోలుకు 80 వేల రూపాయలను అందించి ప్రారంభించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిరుపేదలను గుర్తించి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, రవి రెడ్డి, రామకృష్ణప్ప, విజయ్ రెడ్డి, పద్మనాభరెడ్డి, రామలింగారెడ్డి, బాలరాజు ,అవినాష్, ఆదిల్, నవీన్, మంజునాథ్, చలపతి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైటప్ ఆర్ కె పి ఎం 2

## నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం



బంగారుపాళ్యం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

నేరాలను నియంత్రించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు అన్నారు. బుధవారం సాయంత్రం బంగారుపాళ్యంలో ఫుట్ పెట్రోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పోలీసులు ర్యాలీ చేపట్టి ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నియంత్రించాలన్నారు. అలాగే సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా, మహిళా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తది తర అంశాలనుప్రజలతోచర్చించారు. ఈకార్యక్రమంలోఎస్ఐ ప్రసాద్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పాలు, పండ్లు పంపిణీ



బంగారుపాళ్యం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు ఫోటోగ్రాఫర్లు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మండల ఫోటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షులు శంకరన్ మాట్లాడుతూ 187వ ఫోటో గ్రాఫర్ల దినోత్సవంను బంగారుపాళ్యంలో ఘనంగా నిర్వహించామన్నారు. ఫోటోగ్రఫితో జీవినం సాగిస్తూ కుటుంబ పోషణ చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిట్టిబాబు, ఫోటోగ్రాఫర్లు సుబ్రమణ్యం, సోము, రాజేష్, ఆయూబ్, అస్లాం, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక లారీలు స్వాధీనం - ముగ్గురిపై కేసు నమోదు

గుడిపాల, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండలం నుండి తమిళనాడు రాష్ట్రంకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎన్ఆర్‌పేట, జిడినెల్లూరు ఇసుక రీచ్‌ల నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువచ్చి గుడిపాల మండలంలోని నారగల్లు పంచాయతీ సిఎం కండ్రిగ తాటికుంట చెరువు వద్ద డంప్ చేసి సదరు ఇసుకను లారీల ద్వారా తమిళనాడులోని రాణిపేట, వేలూరు తదితర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలసులకు సమాచారం అందిందని ఎస్ఐ వివరించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు తన ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు అజిత్‌కుమార్, అంబరస్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తే నారగల్లుకు చెందిన ఉమాపతి అలియాస్ విక్కి ముఖ్య సూత్రదారిగా తేలిందన్నారు. ఈ మేరకు అజిత్‌కుమార్, అంబరసులతో పాటు ఉమాపతి అలియాస్ విక్కీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

# “స్టూడెంట్ నేషన్” వాలంటీర్స్ సేవలు అభినందనీయం



## తిరుపతి రోటరీ క్లబ్, స్విమ్స్, రుయా మోడల్ బ్లడ్ బ్యాంక్ సహకారం స్టూడెంట్స్ నేషన్ మూడవ మెగా రక్తదాన శిబిరం విజయవంతం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాదముని రెడ్డి

**తిరుపతి హెల్త్, (రేణిగుంట) ఆగస్టు 19 ప్రభాతవార్త:**

సామాజిక సేవలు నిర్వహించడంలో స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ సేవలు అభినందనీయమని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాదముని రెడ్డి అన్నారు. అన్నమాచార్య కళాశాలలో బుధవారం తిరుపతి రోటరీ క్లబ్, స్విమ్స్ బ్లడ్ బ్యాంక్, రుయా మోడల్ బ్లడ్ బ్యాంక్ సాంకేతిక సహకారంతో అన్నమాచార్య కళాశాలకు చెందిన స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ (పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు) ఆధ్వర్యంలో మూడవ మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థుల, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు 250 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం యొక్క అవసరం గొప్ప సవాలుగా మారిందన్నారు. రహదారులపై నిత్యం జరుతున్న ప్రమాదాలు అనేక కుటుంబాలలో ఆనందాలను చిదిమేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రక్తం యొక్క అవసరాన్ని గుర్తించి విద్యార్థులు ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా సమాజానికి మీరు చేసే సేవ నిజమైన దేశ సేవే కాగలదంటూ మన కళాశాలలో గత ఏడాది 220 మందితో చేసిన రక్తదానం మరువక ముందే మరోమారు 250 మంది రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం స్టూడెంట్ నేషన్ చైర్మన్ జ్యోష్ణ అబ్బవరం మాట్లాడుతూ స్టూండెంట్ నేషన్ సభ్యులు కె.సాయి చౌదరి, ధర్మయ్యగారి త్రివిక్రమ్ రెడ్డి, ఎం.సాయి సాహితి, కె.ప్రవళ్ళిక, టి.రోషిణి, ఆర్.రేణు సారిక, కె.రెడ్డి ఉష, పి.సాయి సిద్ధార్ధ్, వి.అరుణ్, పి.క్రాంతికుమార్, జి.సాయి సిద్దార్ధ్ రెడ్డి, పి.గౌతమ్‌కుమార్, ఎస్.షేక్ షాన్ ఉమ్మడి కృషి ఫలితంగా రక్తదాన శిబిరం విజయవంతమయ్యిందని కృతజ్ఞతలు తెలిపారు. మా కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాదమునిరెడ్డి ప్రోత్సాహం, తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.శివాజీ సహకారం, తిరుపతి రుయా హాస్పిటల్ సూపరిండెంటెంట్ డాక్టర్ బి.మనోహర్, పెథాలజీ హెచ్ఒడి డాక్టర్ ఇంద్రాణి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి (సిఎఎస్), స్విమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ అందించిన సాంకేతిక సహకారంతోనే ఇంతటి మెగా క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించగలిగామని వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. సమాజాన్ని సామాజిక మార్పుకు వేధిక మార్చడమే మా “స్టూడెంట్ నేషన్” లక్ష్యమన్నారు. ఈ రక్తదాన శిబిరం అర్ధవంతమైన మరో (మూడవ సారి రక్తదాన శిబిరం) అడుగు వేయడంతో 250 మంది దాతలు ముందుకు రావడం మా బృందం యొక్క కృషికి నిదర్శనమన్నారు. ఈ రక్తదాన శిబిరం విద్యార్థులు, అధ్యాపకుల ఐక్యతకు నిదర్శనంగా నిలవడంతో పాటు సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించడంలో గొప్ప మైలురాయిగా నిలిచిందని కొనియాడారు. రక్తదాన శిబిరం విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఆహార, వ్యవసాయ సాంకేతిక రంగాలపై అవగాహన సదస్సు




**తిరుపతి విద్య ఆగష్టు 19 ప్రభాత వార్త**

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఆహార విజ్ఞానం, వ్యవసాయ సాంకేతిక విజ్ఞానం, బయోటెక్నాలజీ రంగాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మలేషియా టెరెంగ్గాను (యుఎమ్‌టీ) నుంచి విచ్చేసిన డాక్టర్ మన్నూరు ఇస్మాయిల్ షేక్ విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్ అనంతరం ఆహార, వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. బయోటెక్నాలజీలోని వివిధ అంశాలను వివరించడంతో పాటు యుఎమ్‌టీ అందిస్తున్న వివిధ కోర్సులు, వాటి ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యలో ఎలా రాణించవచ్చో తెలియజేశారు. కార్యక్రమంలో యుఎమ్‌టీ విద్యార్థులు ఫాతిమ్ అనిస్, నూర్ అతిమ్, నూర్ మైత్రా, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు డా. హేమలత, డా. కుసుమ, బయోటెక్నాలజీ విభాగ విద్యార్థినులు, ఎస్‌వీ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ, వ్యవహారాల డైరెక్టర్ డా. వివేక్, విద్యార్థి సమాఖ్య సభ్యురాలు డా. జయమ్మ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థినులు సదస్సును సద్వినియోగం చేసుకున్నారు

## నిరుద్యోగ యువతకు ఉచిత వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణ

**తిరుపతి విద్య ఆగష్టు 19 ప్రభాత వార్త**



నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) 4.0 కింద ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. తిరుపతిలోని ప్రభుత్వ ఎస్‌వీ పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ హబ్‌గా ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్ కోర్సులో 300 గంటల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా అంత కంటే ఎక్కువ విద్యార్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 8143576866 నంబర్‌ను సంప్రదించడంతో పాటు హెచ్‌టిటిపిఎస్:// ఫార్మ్స్.జీఎల్ఈ/ ఎయూఐ హెచ్‌జెఎమ్‌డబ్ల్యుపిఆర్‌పిఏడబ్ల్యూఎం5ఆర్‌బి7 వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

## గృహిణుల సేవలకు టాటా టీ చక్ర గోల్డ్ వందనం

**తిరుపతి విద్య ఆగష్టు 19 ప్రభాత వార్త**

గృహిణుల నిస్వార్థ సేవలు, కుటుంబ నిర్మాణంలో వారి కీలక పాత్రను గుర్తిస్తూ టాటా టీ చక్ర గోల్డ్ ఘనం సోచ్ పేరుతో కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. జీతం రూపంలో ఆదాయం లేకపోయినా కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో గృహిణుల శ్రమకు వెలకట్టలేమనే సందేశాన్ని ఈ ప్రచారం అందిస్తోంది. గృహ రుణం కోసం దరఖాస్తు చేసే కుటుంబం నేపథ్యంలో రూపొందించిన ప్రచార చిత్రంలో భార్యకు జీతపు చీటీ లేకపోయినా, కుటుంబ నిర్వహణలో ఆమె పాత్ర ఎంత కీలకమో చూపించారు. ఇంటిని నిర్మించడంలో భార్యను సమాన భాగస్వామిగా భర్త అంగీకరించే సన్నివేశం ద్వారా గృహిణుల శ్రమకు గుర్తింపు ఇవ్వాలనే సందేశాన్ని చాటిచెప్పారు. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ బేవరేజెస్ అండ్ ఆర్గానిక్ ఇండియా ప్రెసిడెంట్ శరత్ వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తమకు ముఖ్యమైన మార్కెట్ అని తెలిపారు. ఘనం టీ, ఘనం ఆలోచనను ప్రేరేపిస్తుంది అనే బ్రాండ్ నమ్మకానికి ఘనం సోచ్ కొనసాగింపని పేర్కొన్నారు. గృహిణుల నిశ్శబ్ద శక్తిని గుర్తించి, వారి సేవల పట్ల గౌరవాన్ని పెంచడమే ప్రచారం లక్ష్యమన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**రొంపిచెర్ల, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రొంపిచెర్ల మండలం పజులుపేట ప్రాథమిక పాఠశాలలో స్థానిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఫోటో స్టూడియో అధినేత, సీనియర్ ఫోటోగ్రాఫర్ మల్లేపల్లి వెంకటేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఎస్. రాధా చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒక ఫోటో ఎన్నో విషయాలను, సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించగలదన్నారు. సమాజంలోని సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్ల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. వార్తా పత్రికలు, న్యూస్ చానళ్ల ద్వారా సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్లు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఫోటోగ్రాఫర్ వెంకటేష్ విద్యార్థులకు ఫోటోగ్రఫీ ప్రాధాన్యత, ఫోటోలు తీసే విధానాలు, పాటించాల్సిన మెలకువలు, ఈ రంగంలో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఆసరా ప్రతినిధి, విద్యావేత్త డా. టి. రఘునాథ్, గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు డా. జి.వి.ఎస్. బాబు, బర్డ్ సంస్థ అధ్యక్షుడు వి. సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పి. రవిశేఖర్ రెడ్డి, అహ్మద్ అలీ, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాసుకుప్పం, సత్యవేడు ఏరియా ఆస్పత్రి ఏర్పాటుకు సిఎంకు వినతి

**నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :**

సత్యవేడు నియోకవర్గంలో ప్రధాన సమస్యగా వున్న దాసుకుప్పం రహదారి, సత్యవేడులో ఏరియా ఆస్పత్రి ఏర్పాటుకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారాచంద్రబాబునాయుడుకి సిఎం క్యాంపు ఆఫీసులో బుధవారం వినతిపత్రం అందించారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు స్పీకర్ రఘురామకృష్ణంరాజు అవకాశం కల్పించడంతో ప్రధానంగా ఈ సమస్యలను ప్రస్తవించారు. బుధవారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసుకుప్పం రహదారి నిర్మించడంతో ప్రభుత్వానికి చాలా మంచి పేరు వస్తుందని తెలిపారు. దీంతో తమిళనాడు మీదుగా సత్యవేడు వెళ్లే సమస్య ప్రజలందరి తీరుతుందని తెలిపారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు పరిశీలించిన ఎస్పీ

**చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:**



పోలీసు శాఖ ఆధ్వర్యంలో చిత్తూరులో విధులు నిర్వహించే కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును బుధవారం ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను ఎస్పీ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్ళలో వున్న సిసి కెమెరాల దృశ్యాలను లైవ్‌గా పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సయంలో ఎస్ఓఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే డయల్ 112 విభాగంను పరిశీలించిన ఎస్పీ ఇది ప్రజలకు అత్యవసరమైన పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలు అందించే అత్యంత కీలక నెంబర్ అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వుండాలని, వీరికి ప్రతి కాల్ ఒక ప్రాణాంతక పరిస్థితిని సూచించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐ మోబీన్‌తాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## విక్టరీస్ ఫ్యూచర్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

### ఏఐఎస్ బి రాష్ట్ర అధ్యక్షుడు సగిలి రాజేంద్ర ప్రసాద్



**రైల్వేకోడూరు అర్బన్, ఆగస్టు 19, ప్రభాత వార్త.**

రైల్వేకోడూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విక్టరీస్ ఫ్యూచర్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మంగళగిరి లోని విద్యాభవన్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ అజీజ్‌కు పిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైల్వే కోడూరు పట్టణంలోని విక్టరీస్ ఫ్యూచర్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా సి.బి.ఎస్.ఈ సిలబస్ అని తప్పుడు ప్రచారం చేస్తూ అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహించి విద్యార్థుల నుండి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పాఠశాల బిల్డింగ్ లోనే హాస్టల్ సైతం నిర్వహిస్తూ ఏసీ క్యాంపస్ అంటూ ప్రచారం నిర్వహిస్తూ అధికారులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని వారు తెలిపారు. జిల్లా అధికారులకు అనేక సార్లు పిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పట్టణం లో విక్టరీ స్కూల్స్ బ్రాంచ్‌లకు సరైన సదుపాయాలు సైతం లేవన్నారు. పాఠశాలకు ప్లే గ్రౌండ్ మరియు పార్కింగ్ ప్లేస్ కూడా లేవన్నారు. రైల్వే కోడూరు లోని విక్టరీ స్కూల్స్ పై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**చిట్వేలి, ఆగస్టు 19 ప్రభాతవార్త**

వెనుకబడిన బీసీ వర్గాల వారికి చట్టసభలలో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానంపై మండల కూటమి నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి కార్యాలయం నందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘము నాయకులు సేతు శంకరయ్య యాదవ్ మాట్లాడుతూ ఆ నాడు ఎన్టీఆర్ దగ్గర నుంచి ఈ నాడు చంద్రబాబు నాయుడు వరకు బీసీ వర్గానికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు చట్ట సభలలో సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అని కొనియాడారు. అలాగే వడ్డెర కమ్యూనిటీకి చెందిన సాధారణ అంగన్వాడీ మహిళ రమాదేవికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వడం చంద్రబాబు మహిళలపై ఉన్న గౌరవానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు కాకర్ల నాగార్జున నాయుడు, సీనియర్ నాయకులు లారీ సుబ్బారాయుడు, బాలు రామాంజనేయులు, సీనియర్ బీసీ నాయకులు సేతు శంకరయ్య యాదవ్, రాయన సుబ్బారాయుడు, గుండయ్య యాదవ్, నంద్యాల ధనంజయ, దేరంగుల వెంకటేష్, బీసీ యువనాయకుడు మించల బాలకృష్ణ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు మన్నూరు సుదీర్ రెడ్డి, మాచినేని సుబ్బరామయ్య, పగడాల వెంకటేష్, యూనిట్ ఇంచార్జ్ బండారు శివ తదితరులు పాల్గున్నారు.

## సర్ అభ్యంతరాలపై ఎమ్మార్వో అఖిలపక్ష భేటీ.



**చిట్వేలి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

ఓటర్ల తుది జాబితా విధివిధానాలపై నెలకొన్న అభ్యంతరాలను తెలుసుకునేందుకు స్థానిక ఎమ్మార్వో నరసింహారావు బుధవారం అఖిలపక్ష నాయకులతో కలిసి రెవిన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా పై మండల పరిధిలో మీ దృష్టికి వచ్చిన సమస్యలను తెలపాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటును కోల్పోకుండా, అనర్హత ఉన్నవారు ఓటును పొందకుండా పకడ్బందీగా సర్ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. తుది జాబితా పూర్తి కాకముందే ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని అఖిలపక్ష నాయకులకు ఎమ్మార్వో సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి , నవీన్య, యన్నారు తేజ, గిరిబాబు రాజు, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, కూటమి నాయకులు అనంత యాదవ్, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమాచార్యలో ఘనంగా విద్యార్థుల పరిచయ కార్యక్రమం



**రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త..**

రేణిగుంట మండలం వెంకటాపురంలోని అన్నమాచార్య సాంకేతిక, శాస్త్ర విద్యాసంస్థలో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం బుధవారం పరిచయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉన్నత విద్య, భవిష్యత్ లక్ష్యాలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.....కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌటిల్య సంస్థ డైరెక్టర్, ప్రముఖ ప్రేరణాత్మక వక్త శ్రీధర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉన్నత విద్యలో సృజనాత్మకత, లక్ష్యసాధన, సమయపాలనతో పాటు నిరంతర కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆచరణాత్మక అనుభవాలను సొంతం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో కష్టపడి పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా, ప్రయోగశాల, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.!!కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ నాదముని రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ బి. రామచంద్ర, అధ్యాపకులు, ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అమర రాజా ప్రాధాన్యత



**రేణిగుంట, ఆగస్టు 19ప్రభాతవార్త**

ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం, నివారణాత్మక వైద్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అమర రాజా సంస్థ వార్షిక వైద్య పరీక్షలు-2026 కార్యక్రమాన్ని బుధవారం అమర ఆసుపత్రి భాగస్వామ్యంతో ప్రారంభించింది. ఉద్యోగుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం అందించడం కార్యక్రమం లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది తొలిసారిగా 45 ఏళ్లు పైబడిన ఉద్యోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రవేశపెట్టారు. అలాగే ‘ఆరోగ్య స్థితి సూచిక’ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఉద్యోగులు తమ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని గత వైద్య పరీక్షల ఫలితాలతో పోల్చుకుని ఆరోగ్య పురోగతిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా అమర రాజా సంస్థకు చెందిన సుమారు 24,020 మంది ఉద్యోగులు ఈ పరీక్షలకు అర్హులుగా ఉండగా, సంస్థకు చెందిన ఐదు తయారీ కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నివారణాత్మక వైద్య సంరక్షణ, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, ఆరోగ్యవంతమైన ఉద్యోగ బృందాన్ని తీర్చిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో అమర ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామాదేవి గౌరినేని, అమర రాజా అధికారులు ప్రశాంత్ తివారీ, డాక్టర్ చంద్రబాబు, నళిని కుమార్, మంగళ్ ఇండస్ట్రీస్ సీఈఓ శ్రీరామ్ ఎస్వీ, గల్లా ఫుడ్స్ విభాగం అధిపతి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం సంస్థ అభివృద్ధికి కీలకమని ఈ సందర్భంగా!! తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



**విజయపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి మునిభాస్కర్‌రాజు, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు చుక్క ధనంజయయాదవ్‌లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎం అగరం, పన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి, కాళికాపురం గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు మునికృష్ణయ్య, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, ధర్మారెడ్డి, బాబు, ఏళుమలై, దామునాయుడు, ఆనంద నాయుడు, కపిల్, భాస్కర్‌రెడ్డి, బాలాజీ, స్వామివేలు, లక్ష్మయ్య, దొరైరాజ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న నమ్మకం...

## తిరుపతి జిల్లాలో ఇంటర్ ప్రవేశాలు 10 శాతం పెరుగుదల



**తిరుపతి విద్య ఆగష్టు 19 ప్రభాత వార్త**

తిరుపతి జిల్లాలో ప్రభుత్వ రంగ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలు 10 శాతం పెరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ఆర్ఐఓ డాక్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 4,942 మంది విద్యార్థులు ప్రవేశం పొందగా, 2026-27లో 5,442 మంది చేరారని, గత ఏడాదితో పోలిస్తే 500 మంది విద్యార్థులు అదనంగా చేరినట్లు వెల్లడించారు. ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ చేపట్టిన పలు సంక్షేమ, విద్యా కార్యక్రమాల వల్లే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని డాక్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ 2025 జనవరి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఉచిత భోజనం అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా 2024-25 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రికార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. సగటు ప్రతిభ కలిగిన విద్యార్థులకు సంకల్ప్ స్టడీ మెటీరియల్ అందించి, వారి విద్యా సామర్థ్యం, పరీక్ష ఫలితాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

జిల్లాలో 2025-26లో 74 ప్రభుత్వ రంగ జూనియర్ కళాశాలలు ఉండగా, 2026-27లో వాటి సంఖ్య 76కు పెరిగిందన్నారు. ప్రభుత్వ కళాశాలలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ కళాశాలల్లోనూ విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ కళాశాలల్లో గత ఏడాది 186 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 333 మందికి చేరడం విశేషమన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వ విద్యపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతోందని డాక్టర్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలు, పరీక్ష ఫలితాలను మరింత మెరుగుపరిచేందుకు శాఖ తరఫున నిరంతర చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి ఆర్డీఓ విచారణ



వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండల పరిధిలోని జమీన్ కొత్తపాలెం, వాలమేడు గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేందర్‌రెడ్డి బుధవారం వాకాడు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులతో భూ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జమీన్ కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డుల్లో పేర్లు నమోదు కాలేదని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. భూములకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన ఆర్డీఓ దేవేందర్ రెడ్డి సమస్యపై సమగ్రంగా విచారణ చేపట్టాలని తహసీల్దార్ ఇక్బాల్ సయ్యద్ ఆదేశించారు. ఈ అంశంపై విచారణ కొనసాగుతుందని ఆర్డీవో దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రౌతు రామకృష్ణ, కేన్సస్ ప్రతినిధి ఎన్‌వీఎస్ఎస్. దీక్షితులు, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో... శ్రావణ మాస ప్రత్యేక పూజలు



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త: సూళ్లూరుపేట లోని శ్రీ చెంగాళమ్మ మాత పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి బుధవారం తెలిపారు. రెండవ శుక్రవారం 21వ తేదీన అమ్మవారికి పుష్పయాగం, మూడవ శుక్రవారం 28వ తేదీ అమ్మవారికి గాజుల అలంకారం, నాలుగో తేదీ నాలుగవ శుక్రవారం అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న దలచిన మహిళా భక్తులు కలశ పాత్ర, పంచ పాత్ర, ఉద్ధరిని తీసుకొచ్చు కోవాలని, పూజా సామాగ్రిని ఆలయం వారు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచినవారు ఉదయం 9 గంటలకు దేవస్థానం వద్దకు రావాలని తెలిపారు.

## టిడిపిలో బీసీలకు పెద్దపీట



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేయడం జరుగుతుందని స్థానిక టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకు తోట రమేష్, చిట్టేటి పెరుమాళ్ళు, విజి కిషోర్లు తెలిపారు. బుధవారం స్థానికరైల్వే గేటు వద్దనున్న టిడిపి కార్యాలయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతూ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రూరల్ పరిధిలో 34 శాతం, పట్టణ పరిధిలో 33.1 శాతం రిజర్వేషన్లు బీసీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ పరిణామమని చెప్పారు. పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నేత ఎన్టీఆర్ వద్ద నుంచి ఇదే ఒరవడి కొనసాగుతుందని వారు చెప్పారు. ఈ సమావేశంలో మేడ సాయి నారాయణ, దంతాల రవి, బట్ట సుబ్రహ్మణ్య యాదవ్, వంశి, అలవల శ్రీనివాసులు, కే వెంకటేష్ యాదవ్, పోలూరు శ్రీనివాసులు, జోగేశ్వరరావు, ఆరని చంద్రమోహన్, సిహెచ్ రమణయ్య, నలజాం రాము తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం : ఎంపీ



వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: గుమ్మిడిపూండి-గూడూరు మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఎంపీ డా. మద్దిల గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు ఉన్న రెండు లైన్లకి అదనంగా మరో రెండు లైన్లు నిర్మించా నున్నారని ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం 90 కిలోమీటర్ల పొడవుతో, రూ.2,229 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారని ఆయన తెలియజేశారు. ఈ పనులను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ల నిర్మాణంతో చెన్నై, గూడూరు, రేణిగుంట మార్గంలో రైళ్ల రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా గూడూరు చెన్నై, విజయవాడ, రేణిగుంటలను అనుసంధానించే కీలక రైల్వే జంక్షన్ కావడంతో ఈ ప్రాజెక్టుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ప్రాజెక్టులో స్వర్ణముఖి నదిపై 360 మీటర్ల మెగా బ్రిడ్జితో పాటు 21 ప్రధాన వంతెనలు, 127 చిన్న వంతెనలు, 34 రోడ్ ఓవర్ బ్రిడ్జు, రోడ్డు అండర్ బ్రిడ్జు నిర్మించనున్నారని తెలిపారు. అదనపు సరుకు రవాణా సామర్థ్యం పెరగడం ద్వారా సిమెంట్, కంటైనర్లు, యంత్రాలు, ఆహార ధాన్యాలు, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణాకు మరింత వెసులుబాటు కలుగు తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు ప్రాంతాల రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలకు దోహదపడు తుందని ఎంపీ అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కీలక రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## సూళ్లూరుపేటలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాత వార్త: సూళ్లూరుపేట లోని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్, మహాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కొరకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు, ఎస్సై మహేష్, బాల గురవయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ సభ్యులు తడ వెంకటేశ్వరరావు, ఆవల దాస్, సుబ్రహ్మణ్యం, రమేష్, గంగా, హఫీజ్, హరి సుబ్రహ్మణ్యం, లోకేష్, దయ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు విద్యాసామాగ్రి పంపిణీ



వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులోని గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలోని 15 మంది చిన్నారులకు వారికి అవసరమైన విద్యా సామాగ్రిని కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకాడు తాలూకా ఖజానా అధికారి రవీంద్రనాథ్ చేతుల మీదుగా విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ మాట్లాడుతూ మా ఫౌండేషన్ నేటికీ 11703 సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఆర్ఓ ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి, ఉపఖజానాధికారి రవీంద్రనాథ్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లిపూడి సచివాలయంను తనిఖీ



వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: వాకాడు మండలం సచివాలయ ఇంచార్జి అధికారి, నెల్లిపూడి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు బుధవారం నెల్లిపూడి సచివాలయంను తనిఖీ చేసి సచివాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సచివాలయంలో ఉన్న సిబ్బంది అందరూ తప్పనిసరిగా ఉదయం 10.30 లోపు బయోమెట్రిక్ అటెండెన్స్ వేసి విధులు పట్ల బాధ్యత తో పని చేయాలని అలాగే సచివాలయంకు వచ్చే ప్రజల పట్ల గౌరవ పూర్వకంగా వ్యవహరించాలి అని ఆయన కోరారు.

## 23న శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం మహా సంప్రోక్షణ

సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండల పరిధిలోని కుదిరి గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జీర్ణోదరణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ కార్యక్రమాలను ఈనెల 23వ తేదీన నిర్వహించినట్లు కార్యక్రమం నిర్వాహకులు బుధవారం తెలిపారు. 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా 23న స్వామివారికి పార్వతీదేవితో శాంతి కళ్యాణాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం గ్రామోత్స వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ మూడు రోజులు పాటు వేద పండితులచే ప్రత్యేక హోమాలు, పూజలు ఉంటాయన్నారు. అలాగే అన్న సమారాధన కార్యక్రమాన్ని ఈ మూడు రోజుల్లో నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు, విజ్ఞప్తి చేశారు.

## ఆర్‌టిఎస్ కంట్రీ కోఆర్డినేటర్‌గా చంద్రశేఖర్



బాలాయపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త: బాలాయపల్లి మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన బిల్లు చంద్రశేఖర్‌కు అరుదైన అవకాశం లభించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, అవసరమైన సహాయ సహకారాల కోసం ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీ యూఏఈ కంట్రీ కోఆర్డినేటర్‌గా ఆయన నియమితులయ్యారు. యూఏఈలోని ప్రవాసాంధ్రులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలు, ఏపీ ఎన్‌ఆర్‌టిఎస్ ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రవాసాంధ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన సమన్వయం చేయడం ఆయన ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నాచంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్, ఏపీఎన్‌ఆర్‌టిఎస్ అధ్యక్షులు, ఎన్నారై వ్యవహారాల సలహాదారు డా. రవికుమార్ వేమూరి, ఎంఎస్ఎం ఈ, ఎస్‌సిఆర్‌పి, ఎన్నారై వ్యవహారాలు, సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. యూఏఈలోని తెలుగు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేస్తాను స్పష్టం చేశారు.

# పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు

**- రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆదేశం- జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను ఎలక్షన్ కమీషన్‌కు వివరించిన కలెక్టర్**



చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించడానికి సమగ్ర ముందస్తు ప్రణాళికతో ఎన్నికల సన్నాహాలను చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ నుండి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సన్నాహాలు, ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల సామాగ్రి సమీకరణ, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, సాంకేతికత పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ అత్యంత సమయ పరిమితితో కూడుకున్న బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, చివరి నిముషంలో సమస్యలు తలెత్తకుండా ప్రతి అంశానికి ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిం చారు. బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామాగ్రి, ఎంపిటిసీ, జడ్పీటిసీ ఫారాలు, బుక్‌లెట్లు, శిక్షణ తదితర ముందస్తు ప్రక్రియలను నిర్ధేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంను ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఓటర్ల జాబితాలు, ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లు, స్వీప్ కార్యక్రమాలు, పరిశీలకుల నియామకం, నామినేషన్లు, నోటీసులు తదితర ఎన్నికల ప్రక్రియలను సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సూచనలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. అలాగే ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ప్రతి నిర్ణయం పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా వుండేలా అధికారులు వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిష్పాక్షికత అత్యంత కీలకమని, ఏ అభ్యర్థి లేదా వర్గానికి అనుకూలంగా వ్యవహరించారనే అనుమానం రాకుండా అధికారులు తమ విధులను నిర్వర్తించాలన్నారు. ఫిర్యాదులు వచ్చినపుడు నిబంధనలు, అందుబాటులో వున్న ఆధారాలను పరిశీలించి నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పట్టణ, స్థానిక సంస్థలు, జడ్పీటిసీ, ఎంపిటిసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నిర్ధేశించిన సమయ పట్టిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించే అంశంను దృష్టిలో వుంచుకుని అవసరమైన సిబ్బంది, ఎన్నికల సామాగ్రి, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, కొత్త మండలాలు, జిల్లా పరిషత్‌లు, ఎంపిటిసీ, జడ్పీటిసీ స్థానాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌కు వివరిస్తూ జిల్లాలో 622 గ్రామ పంచాయతీలు, 5,914 వార్డులు, నాలుగు పట్టణ స్థానిక సంస్థలు వున్నాయని, చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం మున్సిపాల్టీల్లో సైతం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపడుతున్నామని వివరించారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సిబ్బంది నేరుగా సందర్శించి తనిఖీలు చేస్తున్నారని, పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో వున్న సౌకర్యాలు, లోపాలు, అవసరమైన మార్పులను గుర్తించి, వాటి ఆధారంగా మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు వివరించారు. అలాగే పోలింగ్ స్టేషన్ల తనిఖీ ప్రక్రియను నిర్ధేశిత సమయానికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే ఓటర్ల తనిఖీ ప్రక్రియను కులాల వారీగా చేపడుతున్నామని, ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు, మార్పులను నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు కలెక్టర్ ఎన్నికల కమీషనర్‌కు వివరించారు. అలాగే జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కోర్టు కేసుల సమస్య లేదని, ఎన్నికల ప్రక్రియను కొనసాగించడానికి పరిస్థితులు అనుకూలంగా వున్నాయని వివరించారు. క్షేత్ర స్థాయిలో గుర్తించి లోపాలు, గ్యాప్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పూరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో వుండేలా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిర్ధేశిత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేసి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, డిఎల్‌పిఓ సురేష్‌బాబు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేషనల్ గోల్ బాల్ ఛాంపియన్షిప్లో అంద బాలికలు



వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: గుజరాత్ రాష్ట్రం, నడియాడ్ వేదికగా ఈ నెల 20 నుండి 23 వరకు జరగబోయే 2వ యూత్ నేషనల్ గోల్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ తరపున అబ్బాయిలు, అమ్మాయిల జట్లు పాల్గొంటాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి పెంచల నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వెంపటి మాధవ నాయుడు క్రీడాకారులకు క్రీడా కిట్లను అందజేశారు. జట్లకు అవసరమైన టీం జెర్సీలను బాలాయపల్లి మండల టీడీపీ అధ్యక్షులు రాయ సత్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి ఈత మొక్కల మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖలీల్ మహమ్మద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ళ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు నోటీసులు జారీ

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: పట్టణంలోని 20వ వార్డులో ఓటర్లకు బిఎల్ఓ జాస్మిన్, కళ్ళు సతీష్ నోటీసులు జారీ చేశారు. 20 వారిలో 18 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు తీసుకున్న వారు ఆధార్ కార్డుతో సహా పలు రకాల గుర్తింపు కార్డులో చూపించాలని తెలిపారు. నోటీసులు తీసుకున్నవారు రిప్లై ఇవ్వాలని తెలిపారు.

## శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి రూ.1.36కోట్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో బుధవారం హుండీల లెక్కింపుల్లో నగదు రూ.1,31,31,098లు రాగా చిల్లర నాణెములు రూ.5,52327లు వచ్చింది. వెరసి రూ.1.36 కోట్లు వచ్చింది. కాగా వెండి నాగపడగల రూపంలో 406కిలోల 290 గ్రాములు వచ్చినట్లు వివరించారు. కాగా విదేశీ మారక నోట్లు77 వచ్చాయని తెలిపారు. ఇందులో అధికంగా అమెరికా డాలర్లు 20 రాగా మలేషియా యూనిట్రైడ్ అరబ్ ఎమిరెట్స్‌లకు చెందినవి 11 చొప్పున వచ్చినట్లు వివరించారు. హుండీల లెక్కింపుల్లో ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ శ్రీనివాసులు రాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఫోటో వివరాలు చెబుతుంది- ఫోటోగ్రాఫర్లకు సన్మానం



తిరుపతి, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాయలేని ఎన్నో భావాలను ఒక్క ఫోటో ప్రపంచానికి చూపుతుందని, మనసులను మదిలోని భావాలను కదిలించే శక్తి ఒక్క ఫోటో చూపించగలరని బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని పలువురు సీనియర్ ఫోటో జర్నలిస్టులు రామకృష్ణారెడ్డి, భాగవతులు శ్రీనివాసులు లను ఘనంగా సత్కరించారు. మీడియా రంగంలో ఫోటోగ్రాఫర్ల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఏ వన్ మస్తాన్, పెరియస్వామి రామ్ కుమార్, కృష్ణంరాజు, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, తిరుపాలచారిలు పాల్గొన్నారు

## ప్రముఖ పారిశ్రామికవేత్త ... జింపెక్స్ అధినేత ఆర్.ఎస్ గోయింకా కన్నుమూత



రైల్వే కోదూరు అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త జింటెక్స్ కంపెనీ అధినేత ఆర్ఎస్ గోయింకా బుధవారం చెన్నైలో కన్నుమూశారు. ఈయన 1970,71 సంవత్సరంలో ముగ్గురాళ్ల వ్యాపారానికై నాటి కడప జిల్లా నేటి తిరుపతి జిల్లా అయిన మంగంపేట ప్రాంతానికి వచ్చారు. అప్పటినుంచి చెన్నైలో ఉన్న జింపెక్స్ కంపెనీని మంగంపేట, రైల్వే కోదూరు ప్రాంతాల్లో కూడా పెట్టారు. నాటి నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి అయిన వైఎస్ రాజారెడ్డి, సీఎంఆర్ కంపెనీలకు చెందిన సుధాకర్ రెడ్డి, ఐబీసీ కంపెనీలకు చెందిన కందుల ఓబుల్ రెడ్డి, రాజమోహన్ రెడ్డిలతో కలిసి అప్పటినుంచి ఇప్పటికీ ముగ్గురాళ్ల వ్యాపారంలో ఐక్యతతోను, పోటీలతోనూ వ్యాపారం చేసి అంచెలంచెలుగా రైల్వే కోదూరులోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా జింపెక్స్ కంపెనీని స్థాపించి ముగ్గురాళ్ల వ్యాపారాన్ని పోటా పోటీగా చేస్తూ ఆర్ఎస్ గోయింకా తనదైన శైలిలో వ్యాపారధిత్య తన పేరును నిలుపుకున్నారు. ఈయన పేదలను ఆదుకోవడమే కాకుండా అనేక గ్రామాలలోనూ, పట్టణాల లోనూ తన సంస్థ పేరున అధికంగా విరాళాలు ఇచ్చి దేవాలయాలు, బస్ స్టాప్లు వంటి ప్రజా మౌలిక వసతులు అనేక సౌకర్యాలను కల్పించి జింటెక్స్ అధినేత గోయింకా రైల్వేకోదూరు నియోజకవర్గంలో ఒక గొప్ప దాత గానే కాకుండా ప్రజల గుండెల్లో దేవుడిలా కూడా నిలిచారన్నది వాస్తవం. ప్రజలనే కాకుండా వ్యాపారస్తులను ఆర్థికంగా ఆదుకొని వారి గుండెల్లో నిలవడమే కాకుండా పల్లెల్లో ను పట్టణాల్లలోనూ ప్రజల అవసరాలకోసం కట్టించిన బడులు, గుడులు, ప్రజా సౌకర్యాలు ఆయనకు చిహ్నాలుగానే నిలిచి పోయాయి. చిన్న ఆరోగ్య సమస్య చికిత్స నిమిత్తమై చెన్నై ఆసుపత్రి కి వెళ్లిన అయనకు మంగళవారం రాత్రి బ్రెయిన్ స్టోక్ వచ్చి బుధవారం చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ విషయం తెలియగానే మంగంపేట, కోదూరు, కడప, తిరుపతి, చెన్నై లకు చెందిన వందలాది మంది ముగ్గురాయి మిల్లుల యజమానులు, పారిశ్రామిక వేత్తలు, పల్లెలు పట్టణ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మాచినేని విశ్వేశ్వర రావుతో పాటు హరినాధ రెడ్డి, రమణా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, చలపతి లతో పాటు వందలాది మంది వ్యాపారులు అయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

## కుప్పం అర్బన్ సీఐగా సయ్యద్ హాషం బాధ్యతలు



కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త : కుప్పం అర్బన్ సీఐగా సయ్యద్ హాషం బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు .ఈయన ఇదివరకు వైయస్సార్ కడప జిల్లాలో అవినీతి నిరోధక శాఖ విభాగంలో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం కుప్పం అర్బన్ సిఐ గా బాధ్యతలు చేపట్టారు.

## వైసిపి బలోపేతమే...గుడ్ మార్నింగ్ పెళ్లకూరు లక్ష్యం



పెళ్లకూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: వైసిపి పార్టీ బలోపేతమే లక్ష్యంగా గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమాన్ని మొదలు పెట్టామని మాజీ ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. మా అధినాయకుడు జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు అహర్నిశలు శ్రమిస్తామని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైయస్సార్సీపి పార్టీకి అఖండ విజయాన్ని అందిస్తారన్నారు. బుధవారం నాడు అక్కగారు పేట గ్రామంలో స్థానిక వైఎస్ ఆర్సిపి నాయకురాలు నన్నం ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ పెళ్ళికూరు కార్యక్రమంలో పాల్గొన్న కెఎస్‌ఆర్‌కు అఖండ స్వాగతం పలికారు. గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి వైసిపి శ్రేణులు ఆనందంగా ఉన్నారని జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా అన్నారు.

## బీసీలకు 35 శాతం రిజర్వేషన్లు బిల్లు ఆమోదం

వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: బీసీలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పించిన కూటమి ప్రభుత్వ నిర్ణయంపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని నాయకులు మండల ప్రధాన టిడిపి కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోట శ్రీనివాసులు, జడ్పిటిసి మాజీ సభ్యురాలు ప్రమీల, మామిడి గోవిందయ్య, గౌస్ మొహిదీన్, టిడిపి సీనియర్ నాయకుడు తిరుమూరు శ్రీనివాస్ రెడ్డి, టిడిపి నేతలుతోపాటు, బీసీ సంఘాల నాయకులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాస్‌పోర్టు దారపోయినవి**

పులిపాటి రజనికాంతం నాయుడు తండ్రి పి.చంగ ల్రాయనాయుడు, చిరునామా 23-8- 156/4/బి, ప్లాట్ నెం.154, ఏయిర్ బైపాస్ రోడ్డు, న్యూ బాలాజీ కాలనీ, తిరుపతి. గత నెల 31వ తారీఖున మా స్వగృహం నుండి జిరాక్స్ సెంటర్ వెళుతుండగా మార్గమధ్యంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెంబరు W3350238 దారపోయి నది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు సంప్ర: 9441578405.

**సూళ్ళూరుపేట, మున్సిపాలిటీ**

8-2-1 పార్క్ వీధి, సూళ్ళూరుపేట-524 121, ఫోన్:7093900652

mail : sullurpet.mplty@gamil.com

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

ROC No.398/2025/E1 Date: 19.08.2026

సూళ్ళూరుపేట పురపాలక సంఘము నందు 15th FC నిధులతో 3 పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్. అనగా www.apeprocurement.gov.in నుండి టెండరు షెడ్యూలన్ను డౌన్‌లోడ్ చేసుకోనవచ్చు మరియు తదుపరి వివరాలు పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు మొదలు తేది : 19.08.2026 టెండర్లు వేయుటకు చివరి తేది : 02-09-2026.

మునిసిపల్ కమీషనరు
సూళ్ళూరుపేట పురపాలక సంఘము

# శ్రీకాళహస్తి డివిజన్

## లింగమనాయుడుపల్లి పోలింగ్ స్టేషన్ పరిశీలిన



తొట్టంబేడు ఆగస్టు 19 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం లింగమనాయుడు పల్లి గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో ఉన్న పోలింగ్ స్టేషన్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సురేంద్రనాథ్ బుధవారం పరిశిలించారు.ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లోని మౌళిక సదుపాయాలు భద్రత ఏర్పాట్లు మంచినీరు,విద్యుత్ ర్యాంప్ వంటి తదితర వసతులను ఆయన క్షుణ్ణంగా పరిశిలించారు.సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబదిత అధికారులకు సూచించారు.

## 175 లైబ్రరీలను డిజిటలైజ్ చేస్తాం : గురువారెడ్డి



ఏర్పేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: శాసనసభలో గ్రంథాలయాల అభివృద్ధిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ చేసిన ప్రసంగంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ శాఖగురించి మాట్లాడుతూ మంగళగిరి లైబ్రరీడిజిటల్‌గా మార్చడంతో 200 ,300 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, రాష్ట్రంలోని 175 గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిం చిందని, గ్రంథాలయాలకు వచ్చే చెస్ వసూళ్ల నేరుగా లైబ్రరీ ఖాతాకేజమ అయ్యేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బిలాల్ పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో సిబిహెచ్ఐ తనిఖీలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఆరోగ్య డేటాను క్రోడీ కరించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సిబిహెచ్ఐ చేపట్టిన తనిఖీల్లో భాగంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి బుధవారం పరిశీలించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ హెల్త్ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ జి. రామచంద్ర నేతృత్వంలోని బృందం ఆసుపత్రిలోని సీడీ విభాగాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. తిరుపతికి చెందిన సీడీ ఇన్‌చార్జి డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రోజూ వందలాది మంది రోగులు వచ్చే ఈ ఆసుపత్రిలో ఒపీ , ఐపీ రిజిస్టర్ల నిర్వహణ తీరును అధికారులు కూలంకషంగా పరిశీలించారు. ప్రతి రోగి వ్యాధి నిర్ధారణతో పాటు దానికి సంబంధించిన ఐసిడికోడ్‌ను తప్పకుండా నమోదు చేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి కేసును ఐసీడీ కోడ్‌తో లింక్ చేయాలని ఆదేశించారు. అప్పుడే ఆసుపత్రి డేటా విలువ పెరుగుతుంది అని డిప్యూటీ డైరెక్టర్ జి.రామచంద్ర సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, సిఎస్ఆర్ఎమ్ఓ డాక్టర్ మణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారి, హెడ్ నర్స్ విజయకుమారి, సిపిఓ నాగరాజుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు సూచనలను అమలు చేసి, ఆసుపత్రిలో రికార్డుల నిర్వహణను మరింత పటిష్టం చేస్తామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో టిడిపి నేతలు



తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: కన్నలి గ్రామంలో బుధవారం సందడి నెలకొంది. స్థానికులైన కన్నలి ప్రతాప్ రెడ్డి, కన్నలి ప్రవీణ్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవం జరిగింది. ఈ శుభకార్యంలో శాసనసభ్యులు సతీమణి బొజ్జల రిషిత పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఆమెతో పాటు తట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజనాయుడు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉత్సాహంగా...తొట్టంబేడులో డోర్ టు డోర్



తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి నేరుగా అందాలన్నదే లక్ష్యంగా సీఎంప్రారంభించిన డోర్ టు డోర్ కార్యక్రమం తొట్టంబేడు మండలంలో రావిళ్ళ ముని రాజ నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఉత్సాహంగా సాగుతోంది. మండల పార్టీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటి గడప తొక్కారు. కేవలం ప్రచారం కోసం కాకుండా, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.రామ నాయుడు, గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, చంద్రారెడ్డి, బయ్యారెడ్డి, లీలామోహన్ తో పాటు 9బూతుల యూనిట్ ఇన్‌చార్జ్‌లు లెక్కల మురళి నాయుడు, మునిరాజా, సి.భాస్కర్ నాయుడు. పాల్గొన్నారు. బూత్ స్థాయి నుంచి వి. రామయ్య, వి.వెంకటేష్, తాతయ్య, శంకర్ నాయుడు, గోపి, గణేష్, రాఘవులు వంటి బూత్ ఇన్‌చార్జ్‌లు, కోకన్వీనర్ వి.శంకరయ్య గ్రామ నాయకులు కె.రామయ్య, కె.కృష్ణయ్య, వి.పెంచిలయ్య, టి.వెంకటేష్, వై.గుర్రప్ప, కె. రాజనాల తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు.

## కన్నుల పండువగా శ్రీ ద్రౌపది కళ్యాణోత్సవం



చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త: పాంచాల దేశ రాజు ద్రుపద మహారాజు కుమార్తె శ్రీద్రౌపది కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. చంద్రగిరిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం ద్రౌపధి, పాండవుల కళ్యాణ ఘట్టం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక ధర్మరాజుల స్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు ద్రౌపధి సమేత శ్రీధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలు గావించారు. శ్రీకృష్ణుడు ఆశీస్సులతో శ్రీద్రౌపధి సమేత పాండవులకు కళ్యాణ మహోత్సవాన్ని సంప్రదాయ పద్ధతిలో వేదపండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఒకరి పొలం...మరొకరి పేరిట!

### -రీసర్వే గందరగోళంపై శాసనసభలో ఎమ్మెల్యే ఆవేదన



శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త : గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలు చేసిన భూ రీసర్వే ప్రక్రియ రైతుల జీవితాలతో చెలగాటంగా మారిందని శాసనసభలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి బుధవారం ఆవేదన వ్యక్తం చేసారు.కూటమి వచ్చిన తరువాత. శాటిలైట్ చిత్రాల ఆధారంగా చేపట్టిన ఈ సర్వేలో కూడా సాంకేతిక పొరపాట్లు చోటు చేసుకున్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది రైతులు తమ భూములకే వారసులు కాలేని పరిస్థితి నెలకొందన్నారుశాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యల ప్రస్తావన సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, తన నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఇదేనని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం హడావుడిగా చేపట్టిన రీ సర్వేలో తప్పుల పుట్ట పుట్టిందని, దాని పర్యవసానాలు ఇప్పటికీ రైతులను వెంటాడుతున్నాయని ఆయన అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించినప్పుడు రైతులు సార్ మా పొలం మా పేరు మీద లేదు. పాస్‌బుక్ రావడం లేదు. బ్యాంకులో రుణం ఇవ్వడం లేదు. విత్తనాలు, ఎరువులు కొనడానికి డబ్బులు లేవు అని ప్రతి రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. శాటిలైట్ సర్వే పేరుతో భూముల హద్దులు, సర్వే నంబర్లు, యజమానుల పేర్లలో జరిగిన తప్పుల వల్ల రైతులకు రికార్డులు సరిగా రావడం లేదు. ఒకరి ఆస్తి వివరాలు మరొకరి పేరు మీదకు మారిపోవడం, పట్టా భూమి అసైన్డ్‌గా చూపించడం, కుటుంబ సభ్యుల పేర్లు తప్పిపోవడం వంటి అనేక సమస్యలు తలెత్తుతు న్నాయి. ఫలితంగా రైతు భరోసా, పంట రుణాలు, పంటల బీమా, ఉచిత విద్యుత్ వంటి ప్రభుత్వ పథకాలన్నీ రైతులకు దూరమవుతున్నాయి. ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే చేసి తప్పులను సరిదిద్దాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాల్సిన అవసరాన్ని స్పీకర్ కూడా గుర్తించి ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతున్న నీలకంఠేశ్వరాలయం



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అను బంధంగా నిర్వహిస్తున్న ఊరందూరులోని నీలకంఠేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతుంది. గతంలో ఈ ఆలయం నిరాదరణకు గురికాగా ప్రస్తుతం సకల సదుపాయాలతో ముస్తాబబైంది.ఈ నెల 22 నుంచి సెప్టెంబర్ 1 వరకుజరిగే ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించుటకు దేవస్థానం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడితన తరువాత అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశించారు.ఈ నేపథ్యంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేసారు.చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సారథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 అంకురార్పణ,ధ్వజారోహణంతో ప్రారంభమౌతాయి. రాత్రి చప్పర ఉత్సవం నిర్వహించబడుతుంది.ఈనెల 26న రాత్రి నందిసేవ27న రథోత్సవం, 28న కళ్యాణోత్సవం ప్రధానమైవని నిర్వాహకులు వివరించారు.

## తొండమాన్‌పురంలో 25 నుంచి పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తి,రూరల్,ఆగస్టు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు సిద్దం చేస్తున్నారు.ఇక్కడి ఆలయం టిటిడికి అనుబంధంగా నిర్వహిస్తున్నారు. టిటిడిలో జరిగే ప్రతి ఉత్సవం ఇక్కడ నిర్వహించటం ఆనవాయితి. ఈనేపధ్యంలో ఈనెల 25నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమౌతాయి. ఇందుకు టిటిడి ప్రతినిధులు సన్నాహాలుచేస్తున్నారు. నాలుగురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సర్వం సిద్దం చేస్తున్నారు.నాలుగురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి రోజూ సుప్రభాతం,మొదటి గంట, సర్వదర్శనం అంకురార్పణ,పవిత్రాల సమర్పన,ఏకాంత ససేవలను నిర్వహిస్తారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు.ఇక్కడ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా శ్రీకాళహస్తి నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మూటాలమ్మ అలయంలో వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి సమీపంలో చెరువు కట్టపై వెలసిన మూటాలమ్మ ఆలయంలో ఈ నెల 21న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసులురెడ్డి, పూజారి శ్రీనివాసులు, ఇఓ అనందరెడ్డిలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.శ్రీకాళహస్తికి సుమారు 8కిలో మీటర్ల దూరంలో వెలసిన మూటాలమ్మ ఆలయం ధార్మిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇక్కడ పలు పండగలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఇందుకు తగ్గటున్ల ఏర్పాట్లు చేసామని వివరించారు. వరలక్ష్మీ వ్రతం జరుపుకునే మహిళలు వ్రత సామగ్రితో పాటు పాలు పెరుగు తెచ్చుకోవాలని సూచించారు.

## గుడిమల్లం హుండీ రాబడి రూ.8.8లక్షలు



ఏర్పేడు,ఆగస్టు 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు.దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఫణిరాజశయన పర్యవేక్షణలో ఆలయ ఇఓ మునిశెఖర్ లెక్కింపును ఏర్పాటు చేసారు.ఈ లెక్కింపుకు ఆలయ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. భక్తులు హుండీలద్వారా రూ.8,82,382లు వచ్చిందని అలాగే అన్నదానం హుండీల లెక్కింపుల్లో రూ.51,266లు వచ్చినట్లు వివరించారు. ఆలయంకుంబాభిషేకం జరిపిన తరువాత సామాన్య భక్తులతో పాటు అతిధుల తాకిడి పెరిగింది.ఈ లెక్కింపుల్లో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## టైక్వాండలో ఎంజీఎం విద్యార్థి ప్రతిభ




శ్రీకాళహస్తి ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని ఎంజీఎం జూనియర్ కాలేజ్ విద్యార్థి పిఎంకె.తేజో మారుతి ప్రసాద్ టైక్వాండలో(కరాటే) గోల్డ్ మెడల్ సాధించారని ఎంజీఎం గ్రూప్ ఆఫ్ ఎండి గుడ్లూరు మయూర్, ఆయన భార్య ఐశ్వర్యాలు బుధవారం పత్రికల వారికి తెలిపారు. ఎంజీఎం గ్రూప్ ఆఫ్ ఎండి గుడ్లూరుమయూర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా స్థాయిలో జరిగిన టైక్వాండలో గోల్డ్ మెడల్ సాధించి, ఆగస్టు 21,22,23 తారీకులలో శ్రీకాకుళంలో జరగబోయే స్టేట్ లెవెల్‌కి ఎంపిక అయ్యారన్నారు. ఎంజిఎం ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ ఎంజిఎం ఇన్స్టిట్యూషన్స్ చదువులతో పాటు ఆటలు కూడా ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా స్పోర్ట్స్ లో ఇంకా ముందుకెళ్లాలని విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి గుడ్లూరు ఐశ్వర్య గారు,కాలేజ్ ప్రిన్సిపల్ వి.ఎస్ రత్నం పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ద్రౌపదీ దేవి కళ్యాణం



ఏర్పేడు,ఆగస్టు 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న తిరునాళ్ళలో భాగంగా బుధవారం ఉదయం ద్రౌపదీ కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు హాజరు కాగా ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటలో ధర్మరాజుల తిరునాళ్ల భారీ ఎత్తున నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో పాపానాయుడుపేటలో ధర్మరాజుల ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ద్రౌపదీదేవి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణానికి పేట ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ఽకూడా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాన్ని కళ్యాణమండపంగా తీర్చి దిద్దారు. కళ్యాణోత్సవం కన్నుల పండువగా ఆలయ అర్చకులు స్థానిక సంప్రదాయం మేరకు నిర్వహించారు. ఈ కళ్యాణానికి చేనేత సంఘ సభ్యులు మేకళత్తూరు పెద్ద సునరబమణ్యం వళత్తూరు బాలయ్య, మాధవయ్య, తంబా సుబ్రమణ్యం త్యాగరాజ మొదలి, తంబా హరిమొదలి, మునస్వామి, దొరకృష్ణ, కటికంట ప్రకాష్, తదితరులు హాజరయ్యారు.

## క్రమశిక్షణ కల్గిన కార్యకర్తను పొగొట్టుకున్నాం



ఏర్పేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం ఆమందూరు బీసీ కాలనీకి చెందిన టీడీపీ యూనిట్ ఇంచార్జి రాచేటి సుబ్రమణ్యం తండ్రి మునికృష్ణయ్య కర్మక్రియలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యేసతీమణి బొజ్జరి షిత రెడ్డిహాజరై నివాళులు అర్పించారు. మునికృష్ణయ్య నివాళులు అర్పించారు. అనంతరం రాచేటి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, మోహన్ నాయుడు, బాబు నాయుడు, గాలి కృష్ణవేణి, రాఘవేంద్ర, చంద్ర శేఖర్ నాయుడు, కేశినేని సుబ్రమణ్యం, గుణా యాదవ్, రమణ, అశ్వద్ధామ, భూపతి నాయుడు, జయప్రకాష్ నారాయణ, చెవిరెడ్డి గోపాల్ రెడ్డి, నరసింహులు నాయుడు, శీను, బాలాజీ, మునీశ్వర్, సత్యం, గోపాల్, గణేష్ నాయుడు, కృష్ణయ్య, వై మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దయనీయ స్థితిలో మల్లిగుంట అంగన్‌వాడీ




తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని తాటిపర్తి పంచాయతీ మల్లిగుంట గ్రామంలో కనీస వసతులు లేని భవనంలో 5 మంది చిన్నారులతోనే ఈ కేంద్రం నెట్టుకొస్తోంది. చిన్నారులుకు విద్యాబోధనలు నేర్పించడానికి కనీసం బ్లాక్ బోర్డు లేదు, మెనూ బోర్డు లేదు, పిల్లలు లేరు. అంగన్‌వాడీ భవనం ఉంది కానీ లోపల చదువుకు సంబంధించిన ఒక్క ఆనవాలు కూడా లేదు. గోడలపై అ, ఆ, ఇలు, 1,2,3, 4 లేవు, పిల్లలకు రోజూ ఏమి పెడతారో తెలిపే మెనూ బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఆట వస్తువులు, టీఎల్‌ఎం కిట్లు కనిపించలేదు. ఫలితంగా గ్రామంలో చదివే వయసున్న పిల్లల్లో కేవలం 5 మంది మాత్రమే ఈ కేంద్రానికి వస్తున్నారు.అంగన్‌వాడీకి ఆనుకునే ఎస్టి రామానాయుడు కాలనీలో 3 నుంచి 6 సంవత్సరాల వయసున్న చిన్నారులు చాలామంది ఉన్నారు. కానీ వారిని కేంద్రానికి తీసుకురావడానికి ఎలాంటి ప్రయత్నం జరగడం లేదు. తల్లిదండ్రులకు పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య విలువ గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. సిడిపిఓ ఇటువైపు కన్నెత్తి చూసినా పాపానా పోలేదని అని స్థానికులు చెబుతున్నారు. సిఎస్ఆర్ భవనం కజారియా కంపెనీ సిఎస్ఆర్ నిధులతో నిర్మించినది. ఉన్నతాధికారులు స్పందించి మళ్లీగుంట అంగన్‌వాడీని ఆదర్శ కేంద్రంగా మార్చాలని అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## శివయ్య సన్నిధిలో తగ్గిన భక్తుల రద్దీ!

### -తగ్గిన భక్తులు...వచ్చిన వారికి సుదర్శనం




శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త: ఎప్పుడూ రద్దీగా ఉండే శ్రీకాళహస్తీశ్వరాల యానికి భక్తుల రద్దీ తగ్గింది. గత 15 రోజులుగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. నిత్యం కనీసం 20 నుంచి 25 వేల వరకు వచ్చే భక్తులు 15రోజులుగా 15వేలు దాటటం లేదు. దాంతో ఆలయం భక్తుల్లేకుండా వెల వెల బోతుంది. అయితే వచ్చిన వారికి సుదర్శనం సత్వర దర్శన భాగ్యం లభిస్తుంది. స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని నిజరూప దర్శనం చేసుకుంటున్నారు. ఆలయానికి భక్తుల్లేక పోవటంతో పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు,వ్యాపారసంస్థలు జనం లేక బిక్కుబిక్కుమంటున్నాయి. ఇక ఆలయానికి పూజా సామగ్రి విక్రయించే ప్లాట్ దుకాణాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. భక్తులు ఇలా తగ్గటానికి కారణం 'ఆషాఢ మాసం కావడంతో' తమిళనాడు, కర్నాటక, రాష్ట్రం, తెలంగాణ నుంచి భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఎక్కువ మంది కాలసర్పదోష నివారణ పూజలు, రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకుంటారు. అయితే గత 15రోజులుగా ఈ పూజలు చేయించుకునే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది.